క్లుప్తంగా

దొరబాబును కలిసిన ఎంవీఐ



దవులూరి దొరబాబుతో ఎంవీఐ లక్ష్మీ కిరణ్

సామర్లకోట: పెద్దాపురం ఆర్టీఓ కార్యాయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు లక్ష్మీ కిరణ్ శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నానీ తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులు సత్వరం పూర్తిచేయండి



ఎలిమెంటరీ పాఠశాలను పరిశీలించిన సర్వశిక్షాభియాన్ ఈఈ తదితరులు

సామర్లకోట: స్థానిక బలుసులపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.70 వేలు మంజూరు చేస్తున్నట్టు సర్వశిక్షాభియాన్ ఈఈ నాగమోహన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రంగా ఈ పాఠశాలను గుర్తించారు. ఈ పాఠశాలలో నాడు–నేడు రెండో విడత అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మరుగుదొడ్డిని కూల్చివేశారు. ఈ విషయాన్ని ఎన్నికల పరిశీలకులు సర్వశిక్షాభియాన్ అధికారులకు వివరించిన మేరకు ఈఈ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి మరుగుదొడ్లు, మెయిన్ గేట్ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఇందుకు అవసరమైన రూ.70 వేలు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివరామకృష్ణ, హెచ్‌ఎం నూకయ్య, సీఆర్పీ తనూజ, మణికంఠ పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

తుని: ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఈ నెల 23న తుని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున జరిగే గిరి ప్రదక్షిణకు బస్సు సర్వీసు నడుపుతున్నట్లు చెప్పారు. టిక్కెట్టు ధర రూ.3,500గా నిర్ణయించారు. టిక్కెట్లు కావాల్సిన భక్తులు 73829 13216, 73829 13016, 73829 21904 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా 'అత్తిలి'

కిర్లంపూడి: విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా పని చేస్తున్న అత్తిలి వీరబ్రహ్మం కాకినాడ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సంఘ రాష్ట్రస్థాయి నాయకుల సమక్షంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు చెప్పారు. గానుగుల శ్రీనివాస్, కొత్తల ప్రసాద్, లక్కోజు కోటేశ్వరరావు, పలువురు సంఘ సభ్యులు వీరబ్రహ్మానికి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు నల్లగొండమ్మ బోనాల మహోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన నల్లగొండమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఎస్.అన్నవరం, కొత్తూ సూరవరం గ్రామాలకు చెందిన మహిళా భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత



మద్యంతో పట్టుబడ్డ మహిళతో ఎక్సైజ్ అధికారులు

పెద్దాపురం: అనధికారికంగా అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు కాకినాడ డీటీఎఫ్ సీఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ పాత పెద్దాపురానికి చెందిన కుమారి, సోమశేఖర్‌లను అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. వారి నుంచి సుమారు 59 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

కాలీఫ్లవర్ సాగు.. లాభాలు బాగు

- దిగుబడిలో ఫ్లవర్ ఫుల్
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- నియోజకవర్గంలో 70 హెక్టార్లలో సాగు



గొల్లప్రోలు మండలం దుర్గాడలో కాలీ ఫ్లవర్ పంట

పిఠాపురం: ఈ ఏడాది కాలీఫ్లవర్ పంట రైతులను లాభాల బాటలో నడిపిస్తోంది. ప్రస్తుతం కూరగాయలకు మంచి గిరాకీ ఉండడంతో నియోజకవర్గంలో వాణిజ్య పంటల సాగు పెరిగింది. మంచి దిగుబడి వస్తుండడంతో రైతులు కాలీ ఫ్లవర్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఆగస్టు నెల నుంచి రైతులు కాలీ ఫ్లవర్ సాగును ప్రారంభిస్తారు. రబీ సీజన్‌లో నవంబరు మొదటి వారంలో సాగు ప్రారంభమవుతుంది. ఈ ఏడాది రెండు వారాలు ఆలస్యంగా సాగు ప్రారంభించడంతో పంట చేతికి వచ్చే సమయంలోనూ ఆలస్యమైంది. అయినప్పటికీ ధర బాగుడటంతో లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఇటీవల పచ్చ పురుగు తాకిడి ఎక్కువగా ఉండడంతో కొంత వరకు దిగుబడి తగ్గింది. ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి, భూమి లీజు రూ.10 వేలతో కలిపి ఎకరానికి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుండగా రూ.లక్ష వరకూ ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇటీవల ఒక్కో పువ్వు ధర రూ.20 నుంచి రూ.25 వరకు పలకుతోంది.



విరవాడలో కాలీ ఫ్లవర్ రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానశాఖాధికారి శైలజ

నియోజకవర్గంలో...

పిఠాపురం నియోజకవర్గంలోని విరవ, విరవాడ, మంగితుర్తి, మల్లాం, చెందుర్తి, దుర్గాడ తదితర ప్రాంతాల్లో సుమారు 70 హెక్టార్లలో రైతులు కాలీఫ్లవర్ సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉండడంతో కోతలను ముమ్మరం చేశారు. నిత్యం 30 నుంచి 40 వేల వరకు కాలీ ఫ్లవర్లను పిఠాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం, తుని, రామచంద్రపురం, అమలాపురం తదితర ప్రాంతాలతో పాటు విశాఖ, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, గుంటూరు జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.

ధర బాగుంది

రెండు వారాలకు ముందు ఒక్కో పువ్వు ధర రూ.25 వరకూ పలికింది ఇప్పుడు రూ.20 మాత్రమే పలకడంతో కొంత మేర ఆదాయం తగ్గిపోయింది. పచ్చ పురుగు వల్ల పురుగు మందులు ఎక్కువగా పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి ఖర్చు కూడా పెరిగింది. అన్ని చోట్ల కోత ఒక్కసారిగా ప్రారంభించడంతో వ్యాపారులు రేటు తగ్గించేస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి ఆశాజనకంగానే ఉన్నా ధర తగ్గడం వల్ల కొంత నిరాశ చెందుతున్నాం. మార్కెట్‌లో గిరాకీ ఉన్నా వ్యాపారులే ధరలు తగ్గించేస్తున్నారు. తద్వారా మాకు లాభాలు తగ్గుతున్నాయి.

కందా సూర్యనారాయణ, రైతు, మంగితుర్తి, పిఠాపురం మండలం

ఆశాజనకంగా దిగుబడి

ప్రస్తుతం కాలీ ఫ్లవర్ దిగుబడి ఆశాజనకంగా ఉంది. ప్రభుత్వం రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సూచనలు, సలహాలు ఇస్తోంది. రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించేలా చూడడం వల్ల మంచి దిగుబడులు వస్తున్నాయి. ఇటీవల రేటు బాగా పెరిగినప్పటికీ ప్రస్తుతం కొంత తగ్గింది. మళ్లీ పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పచ్చ పురుగు పంటను ఆశించడంతో మేము, మా సిబ్బంది పరిశీలించి రైతులకు తగిన సస్యరక్షణ చేపట్టేలా సూచనలు ఇస్తున్నాం. రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి వారి పంటలను వాళ్లే దూర ప్రాంతాలకు ఎగుమతులు చేసుకునేందుకు వీలుగా కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌ల ఏర్పాటుకు 75 శాతం రాయితీపై అవకాశం కల్పిస్తున్నాం.

శైలజ, ఉద్యానవనశాఖాధికారి, పిఠాపురం



ఆశాజనకంగా పండిన కాలీ ఫ్లవర్

నేడు ఉరుస్, గంధోత్సవం

పెద్దాపురం: పట్టణ శివారు హాజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా (తొమ్మిది మూరల సాయిబు) ఉరుస్ శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దర్గా కమిటీ తెలిపింది. శుక్రవారం కమిటీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ గంధోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపింది.

సత్యదేవుని దర్శించిన కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ



వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న ఉమా నందూరి

అన్నవరం: కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నందూరి శుక్రవారం సాయంత్రం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

కొనసాగుతున్న మత్స్యకారుల ఆందోళన

కొత్తపల్లి: తీర ప్రాంతంలో కాలుష్య పరిశ్రమల నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని, సముద్రంలోకి వేసిన పైపులైన్లు తొలగించాలని కోరుతూ మత్స్యకారులు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. శుక్రవారం ఆందోళన కారులు ఉప్పాడ–తొండంగి బీచ్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. సముద్రంలోని వేసిన పైపులైన్లు తొలగించేవరకూ ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్లిన అభిమానులు



పెద్దాపురం నుంచి విజయవాడకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సామర్లకోట: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణకు అనేక మంది అభిమానులు శుక్రవారం తరలివెళ్లారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు నియోజకవర్గానికి 18 బస్సులు ఏర్పాటు చేశారు. రెండు మండలాలకు 10 బస్సులు, రెండు మున్సిపాలిటీలకు 8 బస్సులు కేటాయించడంతో వాటిలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అభిమానులు తరలివెళ్లారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోజెస్ నాయకత్వం వహించారు.

పెద్దాపురం: విజయవాడ మహానగరానికి మరో మణిహారం సామాజిక న్యాయ మహా శిల్పం ప్రారంభ కార్యక్రమానికి శుక్రవారం పెద్దాపురం అర్బన్, మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులలో వారంతా బయలుదేరి వెళ్లారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, గుర్రాల యాకోబులతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విజయవాడకు తరలివెళ్లిన జనం

పిఠాపురం: విజయవాడ నడి బొడ్డున రూ.400 కోట్లతో నిర్మించిన స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గం నుంచి దళితులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. కాకినాడ ఎంపీ, పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పిలుపు మేరకు శుక్రవారం బస్సులు, వివిధ వాహనాలపై కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలు, పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీల నుంచి వేలాది మంది విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

సమతా సంకల్పసభకు తరలి వెళ్లిన నాయకులు

కొత్తపల్లి: విజయవాడలోని సామాజిక సమతా సంకల్ప సభకు కొత్తపల్లి మండలం నుంచి శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్ళారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఎంపీటీసీ బర్రే రవి, మాజీ ఎంపీటీసీ ఏడిద పెద్దతల్లి, ఉప్పాడ గ్రామ సచివాలయ కన్వీనర్ సవరపు లోవలక్ష్మి, బోడపాటి రాజేష్, మానుకొండ అనిల్, దాసరి లోకేష్, కాశి బాబు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం మండలం నుంచి విజయవాడకు బయలుదేరిన దళితులు



సామర్లకోట నుంచి తరలి వెళ్లిన అభిమానులు



కొత్తపల్లి నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు

22న కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం 22వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత జరిగే సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. పట్టణ అభివృద్ధికి చెందిన అంశాలపై చర్చించడానికి అజెండాలో 26 అంశాలను పొందుపర్చారు.

కో ఆప్షన్‌కు దవులూరి రాజీనామా..

మున్సిపల్ కో ఆప్షన్ పదవికి రాజీనామా చేస్తూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తండ్రి దవులూరి సుబ్బారావు మున్సిపల్ కమిషనర్‌కు లేఖ అందజేశారు. దాంతో ఆయన రాజీనామాపై తదుపరి చర్యలు తీసుకునే అంశాన్ని కూడా అజెండాలో 26వ అంశంగా తీసుకువచ్చారు. ఇటీవల టీడీపీ సీనియర్ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మన్యం చంద్రరావు వైఎస్సార్ సీపీలో చేరడంతో ఆయనకు ఆ పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే ఈ ప్రక్రియ జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

ఇంటింటికీ అయోధ్యరాముని అక్షతల పంపిణీ



పెద్దకలవలదొడ్డి రామాలయంలో అక్షతలతో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి శివారు పెద్దకలవలదొడ్డిలో శుక్రవారం ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, రామభక్తులు అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షతలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అక్షతలు పంపిణీ చేశారు.

మది మురిసే.. ఆనందం విరిసే..

పిఠాపురం- గోర్స రోడ్డులోని మర్రిచెట్టు



- ఆకట్టుకుంటున్న 150 ఏళ్ల నాటి మర్రి చెట్టు
- మొదళ్లను మించిన ఊడలు

కొత్తపల్లి: పిఠాపురం–గోర్స రోడ్డులో ఓ మర్రి చెట్టు ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. మండలంలోని గోర్స శివారులో సుమరు 150 ఏళ్ల నాటి మర్రి చెట్టు ఉంది. చెట్టు కొమ్మలు విస్తరించడంతో పాటు కొమ్మల నుంచి ఊడలు కిందికు వేలాడుతున్నాయి. కొన్ని ఊడలు భూమిలోకి చొచ్చుకెళ్లి వృక్షాలుగా మారాయి. పిఠాపురం మహారాజు గోర్సలో ఉండే గోశాలకు వచ్చినపుడు ఈ చెట్టుకిందే సేద తీరేవారని స్థానికులు చెబుతున్నారు. వేసవిలో కూలీలు, పరిసర గ్రామాల ప్రజలు, పిఠాపురం–గోర్స రోడ్డులో వెళ్లే ప్రయాణికులు ఈ చెట్టు కింద సేదతీరుతారు. కార్తిక మాసంలో వేలాది మంది పిక్నిక్ వచ్చి చెట్టు అందాలను చూసి తరిస్తారు. ఈ చెట్టు కింద కొలువైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు (త్రిమూర్తులు), ఆంజనేయస్వామి విగ్రహాలను నిత్యం వందలాది మంది దర్శించుకుంటారు. ఈ చెట్టు చుట్టు పక్కల భూముల ఉన్న రైతులు, వ్యవసాయ కూలీలు పనులు సమయంలో ఇక్కడే భోజనాలు చేస్తారు. పశుపక్ష్యాదులు సైతం అన్ని కాలాల్లోనూ ఈ చెట్టు కింద సేదదీరుతాయి.



భూమిలోకి చొచ్చుకెళ్లిన ఊడలు



గోర్స గ్రామానికి ఆర్చిలా స్వాగతం పలుకుతున్న మర్రిచెట్టు ఊడలు

'నారాయణ'పై విద్యాశాఖ తనిఖీ

- సెలవుల్లో తరగతుల నిర్వహణ
- నోటీసులు జారీ చేస్తామన్న అర్బన్ డీఐ వాణీకుమారి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు ఉల్లంఘించి పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో శుక్రవారం కాకినాడ రామారావు పేటలోని నారాయణ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు అర్బన్ డీఐ వాణీకుమారి శుక్రవారం తెలిపారు. కాకినాడ ఉపవిద్యాశాఖ అధికారి ఆర్జేడీ రాజు ఆదేశాల మేరకు నారాయణ పాఠశాలలో తనిఖీలు చేపట్టారన్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పాఠశాలకు సమీపంలో ఉన్న ఉపాధ్యాయుల ఇళ్లలోను, పాఠశాలలోను తనిఖీలు నిర్వహించామన్నారు. ఆర్జేడీ, ఇన్‌చార్జి డీఈఓ ఆదేశాలను లెక్కచేయకుండా తరగతులు నిర్వహించడంపై పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. విద్యాశాఖ అధికారులు రావడంతో విద్యార్థులను ఇళ్లకు పంపిచేశారన్నారు. విద్యాశాఖ ఆదేశాలు ఉల్లంఘించి ప్రైవేట్ పాఠశాలలు ఎవరైనా శని, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలలో అర్బన్ డీఐ వాణీకుమారి, సీఆర్పీ రత్నకుమారి, డీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు హనుమంతువఝ్జల అవధాని, కోట వంశీ, ప్రయాగ రాంబాబు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరాం ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

తపోవనాన్ని సందర్శించిన కాశీ ప్రధానార్చకులు



తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సరస్వతి మహాస్వామిని కలసిన ఓం ప్రకాష్ మిశ్రా తదితరులు

తుని రూరల్: కుమ్మరిలోవలోని శ్రీసచ్చిదానంద తపోవనం ఆశ్రమాన్ని కాశీ విశ్వనాథ ఆలయం ప్రధానార్చకులు ఓం ప్రకాశ్ మిశ్రా శుక్రవారం సందర్శించారు.

ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామిని కలసి వేదాశీస్సులు పొందారు. తొలుత ఓం ప్రకాశ్ మిశ్రాకు ఆశ్రమ వేద పండితులు, వేద విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట టిక్ నారాయణ ఉపాధ్యాయ, కాశీ శృంగేరి గోపాల్ గంజ్ ప్యాలెస్ ధర్మాధికారి అన్నపూర్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కిర్లంపూడి: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎస్సై నాగార్జునరాజు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బగ్గ రాంబాబు సారా విక్రయిస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. రాంబాబును అరెస్టు చేసి అతని నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

కిర్లంపూడి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని కిర్లంపూడి పీహెచ్‌సీ వైద్యురాలు టి.సాయిహేమాంజలి అన్నారు. మండలంలోని చిల్లంగిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య స్టాల్స్‌ను ఆమె సందర్శించి రోగులకు డాక్టర్లు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వైద్యులు టి.సాయిహేమాంజలి, జి.శరణ్య, వి.జ్యోత్స్న, శాంతిరంజని 364 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమరం శ్రావణి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వెంకటరమణ, దాసరి చినబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.